బెదిరింపులకు భయపడి
ఏ ఉద్యమం ఆగకూడదు.
నా పత్రికా ఉద్యమం అంతే !
☛ ఎడిటర్

email: aksharabhoomignt@gmail.com
RNI NO: APBIL/2011/37440
Post Regd No. GTR/90/2025-27

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక

Publishing From Guntur. Curculated at Krishna, Prakasam, East & West Godavari, Vizag, Nellore, Kurnool, Hyderabad,Tirupathi, Ananthapuram, Kadapa

విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
అక్షరభూమి
ద్విభాషా దినపత్రికకు అన్ని మండలాలకు, మున్సిపాలిటీలకు విలేఖరులు కావలెను.
బిల్లారాజు
సెల్: 72074 22333

సంపుటి : 16 సంచిక : 30 గుంటూరు ద్విబాషా దినపత్రిక (తెలుగు మరియు ఇంగ్లీష్) ఆదివారం, 29 నవంబర్ 2026 పేజీలు : 4 వెల : రూ. 2/-

మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపక్షాల ఉమ్మడి వ్యతిరేకత

- పునర్విభజనతో ముడిపెట్టడంపై ఇండీ కూటమి అభ్యంతరం
- ఖర్గే నివాసంలో విపక్ష నేతల కీలక భేటీ
- ఎన్నికల సంఘం పాత్రపై కాంగ్రెస్ ఆందోళన
- కేంద్రంపై ఖర్గే తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీలో (అక్షర భూమి) నవంబర్ 28 : నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్లను ముడిపెడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెం టులో ఉమ్మడిగా వ్యతిరేకించాలని ఇండీ కూటమి నేతలు నిర్ణయించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సుమారు రెండు గంటల పాటు జరిగిన విపక్ష నేతల సమావేశంలో ఈ మేరకు ఉమ్మడి కార్యాచరణపై చర్చించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, ఎంపీ కపిల్ సిబల్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న బిల్లులో మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు నియోజకవర్గాల సంఖ్య, వాటి పునర్విభజన అంశాలను కలపడం పట్ల విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సమావేశం అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో తీసుకువస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారుతుందని ఆరోపించారు. – 2లో..

మహిళా రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం: మోదీ

- మహిళలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తాం
- రిజర్వేషన్ల మార్గంలోని అడ్డంకులు తొలగిస్తాం
- వ్యతిరేకించే పార్టీలు అడ్డుకోలేవని స్పష్టీకరణ
- త్వరలోనే అమల్లోకి వస్తాయని ఆశాభావం



న్యూఢిల్లీ, (అక్షర భూమి) నవంబర్ 28 : లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ నుంచి వెనక్కి తగ్గబోదని పునరుద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలు వాటి అమలును ఎప్పటికీ అడ్డుకోలే వని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ముందుకు డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులు రానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. దేశంలోని నారీ శక్తికి సాధికారత కల్పించాలన్న తమ ప్రభుత్వ సంకల్పం చెక్కుచెదరలేదని మోదీ పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో తగిన భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే ప్రతి అడ్డంకిని తొలగిస్తామని భరోసా ఇచ్చారు. మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంలో తమ ధైర్యం అజేయమని, సంకల్పం దృఢంగా ఉందని పేర్కొన్నారు.మహిళలకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించాల న్న పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోందని ప్రధాని గుర్తుచేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ అంశంపై తాను కూడా కృషి చేస్తున్నానని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొస్తున్నారని వెల్లడించారు. ఎంతోమంది అక్కాచెల్లెళ్లు లేఖల ద్వారా తమ ఆకాంక్షలను, అభిప్రాయాలను తెలియజేశారని పేర్కొన్నారు. మహిళల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. దేశంలోని మహిళల ఆశీర్వాదం తమకు ఉందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు తాను భరోసా ఇస్తున్నానని, రిజర్వేషన్ల అమలుకు అడ్డుగా నిలిచే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్న వారిలో ఉత్సాహం రెట్టింపైందని పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యం విషయంలో ఎలాంటి వెనుకడుగు ఉండదని స్పష్టం చేశారు.త్వరలోనే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన సందేశం ద్వారా స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించే పార్టీలు దేశ నారీ శక్తి రాజకీయాల్లో భాగస్వామ్యం కావడాన్ని నిలువరించలేవని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ముందుకు రానున్న బిల్లుల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆక్టోపస్ 2.0 దిశగా ఏపీ పోలీసుల అడుగులు

- రూ.8 కోట్లతో ఆధునిక శిక్షణా సదుపాయాల అభివృద్ధి
- ఉండవల్లి ప్రధాన కార్యాలయంలో పనులకు శ్రీకారం
- ఇంటెలిజెన్స్, సైబర్, డ్రోన్ నిరోధక విభాగాల ఏర్పాటు
- జాతీయ స్థాయిలో దళాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం



అమరావతి,(అక్షర భూమి) : ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ దళాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత పటిష్టంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర పోలీసు శాఖ ఆధునికీకరణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉండవల్లిలోని నులకపేట ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలో సుమారు రూ.8 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన శిక్షణా సదుపాయాలతో దళం సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆక్టోపస్ కమాండోలకు మెరుగైన శారీరక సామర్థ్యం, పోరాట నైపుణ్యాలు అందించేందుకు ప్రత్యేక శిక్షణా –2లో..

నిర్మాణ రంగానికి అనుకూలమైన సంస్కరణలు అమలు చేస్తున్నాం: మంత్రి నారాయణ

- విజయవాడలో ఈనాడు 14వ ప్రాపర్టీ షో
- సొంతింటి కల సాకారానికి చక్కటి వేదిక
- గృహ నిర్మాణ ప్రమాణాలు, రుణాలపై అవగాహన
- రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వ సహకారం



విజయవాడ, (అక్షర భూమి) : విజయవాడలో ఈనాడు ఆధ్వర్యంలో 14వ ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే వారికి ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన గృహాల ఎంపిక, నిర్మాణ ప్రమాణాలు, గృహ రుణాలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ ప్రాపర్టీ షో ప్రత్యేకత అని తెలిపారు. –2లో..

ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి..

- రూ.1.27 లక్షల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ
- ఎంఎంటీపీఏ సామర్థ్యంతో చమురు శుద్ధి కర్మాగారం..
- భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



అమరావతి, (అక్షర భూమి) : ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రానుంది. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో రూ.1.27 లక్షల కోట్ల పెట్టుబడితో చమురు శుద్ధి కర్మాగారం (రిఫైనరీ) ఏర్పాటు చేసేందుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆమోదం తెలిపింది. 9 ఎంఎంటీపీఏ (సంవత్సరానికి 9 మిలియన్ మెట్రిక్ టన్నులు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక రిఫైనరీని ఏర్పాటు చేయనున్నారు.మంత్రి నారా లోకేశ్ ఈ ప్రాజెక్టుపై హర్షం వ్యక్తం చేస్తూ.. దేశ రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో ఈ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో 9 ఎంఎంటీపీఏ రిఫైనరీతో పాటు 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యం కలిగిన ఇథిలీన్ క్రాకర్ యూనిట్, ఇతర పెట్రోకెమికల్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా 10.5 ఎంఎంటీపీఏ ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఈ సమగ్ర పరిశ్రమను అభివృద్ధి చేయనున్నారు. 2032 జులై నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని బీపీసీఎల్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే ప్రభుత్వ, చట్టబద్ధమైన ఇతర అనుమతులు పొందాల్సి ఉంది. ఈ పరిశ్రమ ఏర్పాటుతో దక్షిణ కోస్తా ప్రాంతంలో పెట్రోకెమికల్, రసాయన, పాలిమర్ ఆధారిత అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు పెరగనున్నాయి. దేశీయంగా ఇంధన ఉత్పత్తి, పెట్రోకెమికల్ ఉత్పత్తుల లభ్యత పెరగడంతో పాటు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

రెండో విడత పంచాయతీ ఎన్నికలపై లోకేశ్ దిశానిర్దేశం

- కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి చేయాలి
- బూత్ స్థాయి నుంచే పకడ్బందీ వ్యూహం
- రెబల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం



అమరావతి,(అక్షర భూమి) : ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 29న జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పూర్తి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఇటీవల జరిగిన పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాయని లోకేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో కూటమి పట్ల సానుకూల వాతావరణం ఉందని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో విడత ఎన్నికలను కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానం ముఖ్యమైనదేనని, ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా – 2లో..

న్యాయవ్యవస్థలోనూ ఏఐ సాంకేతికత: చంద్రబాబు

- త్వరలో 'లీగల్ ఏఐ స్టాక్' అమలు
- జీవోలు, చట్టాలు, కేసుల రికార్డుల డిజిటలీకరణ
- ఏఐతో కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



రాజమహేంద్రవరం, (అక్షర భూమి) : ప్రజాపాలనతో పాటు న్యాయవ్యవస్థలోనూ కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతను వినియోగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. త్వరలోనే 'లీగల్ ఏఐ స్టాక్'ను అమల్లోకి తీసుకువస్తామని వెల్లడించారు. రాజమహేంద్రవరంలో తూర్పు గోదావరి జిల్లా కోర్టు 222 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. తాటి ఆకులపై తీర్పులు రాసిన కాలం నుంచి నేటి కృత్రిమ మేధస్సు సాంకేతికత వరకు న్యాయవ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో ఏఐ సాయంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, – 2లో..

మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపక్షాల ఉమ్మడి వ్యతిరేకత

మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడాన్ని తమ పార్టీతో పాటు విపక్షాలు వ్యతిరేకించడం లేదని, అయితే ఆ రిజర్వేషన్లను పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టే విధానాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగా అమలు చేయాలని విపక్షాలు కోరుతున్నాయి. ఎన్నికల సంఘం పాత్రపైనా ఖర్గే పలు సందేహాలు వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది పేర్లు తొలగించారంటూ ఎన్నికల సంఘం పనితీరుపై ఇప్పటికే వివాదాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో నియోజకవర్గాల పునర్విభజన బాధ్యతలను అదే వ్యవస్థకు అప్పగించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరిగితే పక్షపాతానికి అవకాశం ఉంటుందని ఆయన ఆరోపించారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో గతంలో జరిగిన పునర్విభజన ప్రక్రియలను ప్రస్తావిస్తూ, జనరల్ స్థానాలను రిజర్వుడు స్థానాలుగా, రిజర్వుడు స్థానాలను జనరల్ స్థానాలుగా మార్చి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, సమావేశానికి కొన్ని పార్టీలు హాజరుకాలేదు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేడీ నేతలు ఈ భేటీకి దూరంగా ఉన్నారు. సమావేశంలో పాల్గొన్న విపక్ష నేతలు పార్లమెంటులో బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. లోక్‌సభ ప్రస్తుత స్థానాల సంఖ్యను కొనసాగించాలని, అదే ప్రాతిపదికన మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న స్థానాల కేటాయింపును మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని విపక్షాలు కోరుతున్నాయి. పునర్విభజనతో రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్యంలో అసమానతలు ఏర్పడే అవకాశాలపైనా నేతలు చర్చించారు.మహిళా రిజర్వేషన్ల అమలుకు తాము అనుకూలమేనని, అయితే దాని పేరుతో నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించబోమని ఇండీ కూటమి నేతలు స్పష్టం చేశారు. ఈ అంశంపై పార్లమెంటులో జరిగే చర్చల్లో తమ అభ్యంతరాలను బలంగా వినిపించడంతో పాటు, బిల్లులోని పునర్విభజన నిబంధనలకు వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం మహిళా రిజర్వేషన్లను త్వరగా అమలు చేయడానికి పునర్విభజన అవసరమని చెబుతోంది. దీంతో మహిళా ప్రాతినిధ్యం, నియోజకవర్గాల పెంపు, రాష్ట్రాల వారీగా స్థానాల కేటాయింపు వంటి అంశాలు రానున్న పార్లమెంటు సమావేశాల్లో కీలక చర్చకు దారితీయనున్నాయి.

రెండో విడత పంచాయతీ ఎన్నికలపై లోకేశ్ దిశానిర్దేశం

నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని పేర్కొంటూ, బూత్ స్థాయి నుంచే పకడ్బందీ వ్యూహాలను అమలు చేయాలని లోకేశ్ సూచించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, గ్రామాల్లో నాయకులు నిరంతరం అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎక్కడైనా రెబల్ అభ్యర్థుల సమస్యలు ఎదురైతే స్థానిక నాయకత్వంతో చర్చించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసుకోవాలని, ఒక పార్టీ మద్దతుదారుల ఓట్లు మరో పార్టీ బలపరిచిన అభ్యర్థికి బదిలీ అయ్యేలా నాయకులు బాధ్యత తీసుకోవాలని కోరారు.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత గుర్తింపు ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. పదవుల కంటే పార్టీ కోసం చేసిన కృషి, ప్రజలతో ఉన్న సంబంధాలు ముఖ్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. మొదటి విడత కంటే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కూటమి నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 1,171 సర్పంచి స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,803 స్థానాలకు ఆదివారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ నిర్వహించనుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజున పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని లోకేశ్ నేతలకు సూచించారు.

ఆక్టోపస్ 2.0 దిశగా ఏపీ పోలీసుల అడుగులు

మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా కంబాట్ ఫిజికల్ కండిషనింగ్ గ్రౌండ్, లాంగ్ ఫైరింగ్ రేంజ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వీటి ద్వారా కమాండోలు శారీరక దృఢత్వంతో పాటు ఆయుధ వినియోగంలో మరింత నైపుణ్యం సాధించేలా శిక్షణ అందించనున్నారు.ఆధునిక పోరాట పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు మాడ్యులర్ క్లోజ్ క్వార్టర్స్ బ్యాటిల్ (సీక్యూబీ) టాక్టికల్ హౌస్, మాడ్యులర్ వర్టికల్ ట్రైనింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కమాండోల సహనశక్తి, శారీరక సామర్థ్యాన్ని పరీక్షించి పెంపొందించేందుకు కమాండో ఎండ్యూరెన్స్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ సదుపాయాలు వివిధ రకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కమాండోలకు ఉపయోగపడనున్నాయి. ఆక్టోపస్ 2.0 ప్రణాళికలో భాగంగా ప్రత్యేక ఇంటెలిజెన్స్, సైబర్, యాంటీ డ్రోన్ విభాగాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. మారుతున్న భద్రతా సవాళ్లు, సాంకేతిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని దళానికి ఆధునిక పరిజ్ఞానంపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సంప్రదాయ శిక్షణతో పాటు సాంకేతిక సామర్థ్యాలను పెంచడం ద్వారా ఆక్టోపస్ దళాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్, ఐజీపీ (ఆక్టోపస్) ఎస్. సెంథిల్ కుమార్‌తో పాటు



ఆక్టోపస్ అధికారులు, కమాండోలు పాల్గొన్నారు. సుమారు రూ.8 కోట్ల అభివృద్ధి పనులతో శిక్షణా కేంద్రంలో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. ఆక్టోపస్ 2.0 ద్వారా ఆధునిక శిక్షణ, ప్రత్యేక విభాగాలు, సాంకేతిక సామర్థ్యాల సమన్వయంతో దళాన్ని మరింత బలోపేతం చేయడంపై పోలీసు శాఖ దృష్టి సారించింది.

పల్లా శ్రీనివాసరావును కలిసిన నూతన కార్పొరేటర్లు

మంగళగిరి, (అక్షర భూమి) : ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు నూతన కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించిన కార్పొరేటర్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి తమ అభివాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు వారికి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత మరింత పెరిగిందని వారికి సూచించారు. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన కార్పొరేటర్లు తమ పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పల్లా శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి స్థానిక అవసరాలపై దృష్టి సారిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత కార్పొరేటర్లపై ఉందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను నిర్ణయించుకొని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పార్టీ ఆశయాలు, విధానాలకు అనుగుణంగా ప్రతి కార్పొరేటర్ పనిచేయాలని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులుగా గెలిచిన



తర్వాత కూడా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించాలని తెలిపారు. వ్యక్తిగత ప్రాధాన్యతల కంటే ప్రజా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసం మరింత పెరిగేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు తమకు లభించిన అవకాశాన్ని ప్రజాసేవకు ఉపయోగించుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన సూచనలు ఈ సమావేశంలో ప్రధానంగా నిలిచాయి. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం వంటి అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

న్యాయవ్యవస్థలోనూ ఏఐ సాంకేతికత: చంద్రబాబు

అదే విధానాన్ని న్యాయపాలనలోనూ అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. లీగల్ ఏఐ స్టాక్ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టాలు, కేసులకు సంబంధించిన రికార్డులను డిజిటలీకరించనున్నట్లు చెప్పారు. కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ వంటి పనులను ఏఐ సాయంతో సులభతరం చేయవచ్చని వివరించారు.ఇప్పటికే ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. న్యాయపరమైన ప్రక్రియల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా కేసుల నిర్వహణలో వేగం, సమాచార అందుబాటు మెరుగుపడతాయని తెలిపారు. న్యాయవ్యవస్థలో డిజిటల్ పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం వల్ల న్యాయవాదులు, న్యాయస్థానాల పనితీరుకు తోడ్పాటు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రాజమహేంద్రవరం చారిత్రక, సాహిత్య, న్యాయ రంగాల ప్రాధాన్యతను చంద్రబాబు గుర్తుచేశారు. ఆదికవి నన్నయ్య, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ఈ ప్రాంతానికి చెందినవారని పేర్కొన్నారు. ఇక్కడ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి భారతదేశ తొమ్మిదో ప్రధాన న్యాయమూర్తిగా ఎదిగిన జస్టిస్ కోకా సుబ్బారావును ప్రస్తావించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా తన తీర్పుతో అమరావతికి, రాష్ట్రానికి మేలు



చేసిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు ఏపీ హైకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాదికి పూర్తవుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. త్వరలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను సాదరంగా ఆహ్వానించారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలు పటిష్ఠంగా ఉండటం వల్లే ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ స్థిరంగా కొనసాగుతోందని అన్నారు. 2047 నాటికి దేశం వికసిత్ భారత్‌గా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రగా రూపాంతరం చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిర్మాణ రంగానికి అనుకూలమైన సంస్కరణలు అమలు చేస్తున్నాం: మంత్రి నారాయణ

సొంతంగా ఇల్లు కొనుగోలు చేయాలనుకునే వారికి ఒకే వేదికపై వివిధ గృహ నిర్మాణ ప్రాజెక్టులు, వాటి వివరాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని నారాయణ అభిప్రాయపడ్డారు. గృహ నిర్మాణంలో నాణ్యత, భద్రత, నిర్మాణ ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలుదారులు తమ అవసరాలు, ఆర్థిక స్థోమతకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని పేర్కొన్నారు. గృహ కొనుగోలులో రుణ సదుపాయాలు కూడా కీలకమని మంత్రి తెలిపారు. గృహ రుణాలకు సంబంధించిన వివరాలు, అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రాపర్టీ షోలు ఉపయోగపడతాయని అన్నారు. సొంతింటి కోసం ప్రయత్నిస్తున్న మధ్యతరగతి కుటుంబాలు, ఇతర కొనుగోలుదారులకు సరైన సమాచారం అందించడం ద్వారా గృహ కొనుగోలు ప్రక్రియపై స్పష్టత కలుగుతుందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని నారాయణ వెల్లడించారు. ఈ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు నిర్మాణ నాణ్యత, పారదర్శకత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణ రంగానికి అనుకూలమై



న సంస్కరణలను అమలు చేస్తున్నామని, తద్వారా రంగం అభివృద్ధికి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితే నిర్మాణ రంగంతో పాటు దాని అనుబంధ రంగాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. నాణ్యమైన నిర్మాణాలు, పారదర్శక లావాదేవీలు, పెట్టుబడులకు ప్రోత్సాహం వంటి అంశాలు ఈ రంగంలో విశ్వసనీయతను పెంచుతాయని తెలిపారు. ఈనాడు నిర్వహిస్తున్న 14వ ప్రాపర్టీ షో ప్రజలకు గృహ నిర్మాణ, కొనుగోలు అవకాశాలను పరిచయం చేయడంతో పాటు రియల్ ఎస్టేట్ రంగానికి కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

గొల్లపూడి, (అక్షర భూమి) : నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండల జడ్పీటీసీగా జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన మూరకొండ ఏడుకొండలు, గని ఆత్మూరు గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పెర్ల ఆంజనేయులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును మర్యాదపూ ర్వకంగా కలిశారు. శనివారం గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరినీ దేవినేని ఉమ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కంచికచర్ల మండల జడ్పీటీసీగా మూరకొండ ఏడుకొండలు జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం విశేషమని దేవినేని ఉమ అభినందించారు. అలాగే గని ఆత్మూరు గ్రామ సర్పంచ్‌గా ఉప్పెర్ల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టనున్న ఇద్దరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలకు ప్రజల మద్దతు కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని దేవినేని ఉమ సూచించారు. ఎన్నికల ద్వారా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పదవులు ప్రజలకు సేవ చేసే అవకాశాలని, ఆ బాధ్యతను అంకితభావంతో నిర్వహించాలని హితవు పలికారు. కంచికచర్ల మండలంతో పాటు ఆయా గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో చురుగ్గా పనిచేయాలని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.ఈ సందర్భంగా మూరకొండ ఏడుకొండలు, ఉప్పెర్ల ఆంజనేయులు దేవినేని ఉమకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ మండలం, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గొల్లపూడిలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను దేవినేని ఉమ సత్కరించి అభినందించారు.





సాదిరెడ్డి చిన్నవెంకన్న మృతి బాధాకరం: హోంమంత్రి



రేబాక,(అక్షర భూమి) : పార్టీకి ఎంతోకాలంగా సేవలందించిన నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన పెద్ద సాదిరెడ్డి చిన్నవెంకన్న మృతి పట్ల రాష్ట్ర హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తనను కలచివేసిందని తెలిపారు. శనివారం రేబాక గ్రామానికి వెళ్లి చిన్నవెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. చిన్నవెంకన్న మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అనిత పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సమయంలోనే కాకుండా భవిష్యత్తులోనూ కుటుంబానికి తమ పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైనప్పుడు అండగా నిలుస్తామని వారికి ధైర్యం చెప్పారు. రేబాక గ్రామంలో పెద్దగా ఆయనకు ఉన్న గుర్తింపును, పార్టీ కోసం చేసిన సేవలను హోంమంత్రి గుర్తుచేసుకున్నారు. ఎంతోకాలంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ గ్రామస్థులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారని తెలిపారు. గ్రామ అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.చిన్నవెంకన్న మరణంతో గ్రామం ఒక పెద్దను, పార్టీ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని అనిత సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. సాదిరెడ్డి చిన్నవెంకన్న చేసిన సేవలను గ్రామస్థులు, పార్టీ శ్రేణులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని హోంమంత్రి అనిత తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
29 ఆదివారం నవంబర్ 2026

ఘనంగా మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి



గుంటూరు, నవంబరు 28, అక్షర భూమి. మహాత్మా జ్యోతిరావు ఫూలే మహోన్నత సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతిని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలిసి జ్యోతిరావు ఫూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక అసమానతలు, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన వ్యక్తి అన్నారు. బహుజనుల అభ్యున్నతికి మార్గదర్శకుడు అని కొనియాడారు.స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ తన భార్య సావిత్రిబాయి ఫూలేతో కలిసి బాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, ఆత్మగౌరవం కల్పించేందుకు నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని చాటిచెప్పిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధి కోసం మహాత్మా జ్యోతిరావు ఫూలే చేసిన సేవలు భావితరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, సేవాభావాన్ని జీవితాంతం ఆచరించాలి ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, నవంబర్ 28. అక్షర భూమి. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, సేవాభావాన్ని జీవితాంతం ఆచరిస్తూ, సమాజంలో ప్రేమను పంచుతూ వందల మందికి స్ఫూర్తిగా నిలవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు పట్టాభిపురంలోని షాదీఖానాలో నిర్వహించిన హజ్ యాత్రికుల సమావేశానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హజ్ యాత్రకు వెళ్లనున్న యాత్రికులను ఉద్దేశించి ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ,హజ్ యాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన మీ అందరినీ ఒకే వేదికపై కలుసుకోవడం, మీ ఆశీర్వాదాలు తీసుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ప్రతి ముస్లిం సోదరుడు, సోదరి కోరుకుంటారు. అలాంటి అత్యంత పవిత్రమైన యాత్రకు మీరు ఎంపిక కావడం నిజంగా భగవంతుడి ప్రత్యేక అనుగ్రహం. గుంటూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులకు 40 రోజుల పాటు పవిత్ర ప్రదేశాల్లో గడిపే అవకాశం రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. హజ్ యాత్ర అనేది కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదు. మనలోని రాగద్వేషాలు, మితిమీరిన కోరికలు, కోపతాపాలు, స్వార్థాన్ని విడిచిపెట్టి భగవంతుడికి మరింత దగ్గరవుతూ, ప్రేమ, మానవత్వం, మంచితనం వంటి విలువలను అలవర్చుకునే ఒక గొప్ప ఆధ్యాత్మిక ప్రయాణం. అక్కడ నేర్చుకునే నియమాలు, క్రమశిక్షణ, విలువలను యాత్ర ముగిసిన తర్వాత కూడా మన జీవితాల్లో కొనసాగించాలి.మనిషి జీవితంలో ఎలాంటి సమస్యనైనా, ఎలాంటి విభేదాలనైనా అధిగమించగల శక్తి ప్రేమకు మాత్రమే ఉంది. మహమ్మద్ ప్రవక్త కూడా సమాజంలో ప్రేమను, సోదరభావాన్ని పెంపొందించాలని బోధించారు. ద్వేషం, కోపం, స్వార్థం వంటి భావాలు సహజమైనప్పటికీ వాటిని అధిగమిస్తూ నిరంతరం ప్రేమ మార్గంలో పయనించాలి. సమాజంలో మనం ఎక్కడ ఉన్నా ప్రేమను మాత్రమే పంచుతూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. ఈ పవిత్ర యాత్రకు వెళ్తున్న మీరంతా భగవంతుడి ఆశీస్సులు పొందిన అదృష్టవంతులు. అక్కడ గడిపే 40 రోజులు పూర్తి భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో గడుపుతూ ఎన్నో మంచి విషయాలను నేర్చుకోవాలి. వాటిని తిరిగి వచ్చిన తర్వాత మీ కుటుంబాల్లోనే కాకుండా సమాజంలోనూ ఆచరించాలి. మీలో వచ్చే మంచి మార్పు చూసి కనీసం మరో వందమంది అయినా హజ్ యాత్రకు వెళ్లాలని, అలాంటి పవిత్రమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించాలి. మీ ప్రవర్తన, మీ సేవాభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి.ఈ పవిత్ర యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు యాత్రికులకు మార్గనిర్దేశం చేస్తున్న మత పెద్దలందరికీ పేరుపేరునా నమస్కారాలు తెలియజేస్తున్నాను. మీ అందరి ప్రయాణం సుఖసంతోషాలతో, దిగ్విజయంగా సాగాలని, అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరు అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత మీ ఆశీర్వాదాలు మాకు కూడా అందించాలని కోరుకుంటున్నాను అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, హజ్ కమిటీ చైర్మన్ హాసన్ భాషా, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు కూటమి అండ

- హజ్ యాత్రికులకు శిక్షణ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 28. అక్షర భూమి పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ భరోసానిచ్చారు. స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన, శిక్షణ శిబిరానికి రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీఅపర్ణ, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి,హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషాతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విజయ వాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను పునరుద్ధరించడంతో పాటు, అక్కడి నుండి విమానాశ్రయానికి చేరుకునేందుకు రవాణా, బస ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణా లతో కల్పిస్తున్నట్లు వివరించారు. యాత్రికుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఉచిత టీకాలు, వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, సౌదీ అరేబియాలో కూడా తెలుగు మాట్లాడే వలంటీర్లు, వైద్య బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ కు వెళ్లే ప్రతి హజీకి ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తోందని చెప్పారు. రెండేళ్ల కాలంలో 333 మంది హజీలకు లక్ష చొప్పున అందించామని తెలిపారు. షాదీఖానాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడు దల చేశారన్నారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల పెంపుతోపాటు గత ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన బకాయిలు సైతం అందించామని చెప్పారు. జీవితంలో అత్యంత పవిత్రమైన హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, అల్లాహ్ ఆశీస్సులతో క్షేమంగా తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ఆరోగ్య జాగ్రత్తలపై శిక్షకులు అందించే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మక్కా, మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఆయన యాత్రికులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, స్థానిక కూటమి నాయకులు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాచర్ల మున్సిపల్ చైర్మన్ సుష్మా కేశవరెడ్డి..!

అనంతరాములు మనవడి వివాహ మహోత్సవంలో పాల్గొన్న చైర్మన్ దంపతులు



మాచర్ల, నవంబర్28 (అక్షరభూమి): మాచర్ల పట్టణంలోని కోదండ రామాలయంలో శనివారం జరిగిన అనంత రాములు మనవడి వివాహ మహోత్సవములో మున్సిపల్ చైర్మన్ యెనుముల సుష్మా కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.భవిష్యత్తులో వారికి భగవంతుడు అష్టైశ్వర్యాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం చైర్మన్ సుస్మాకేశవరెడ్డిలను అనంత రాములు వారి కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పలపాడులో అయ్యప్ప పడిపూజ..!

గ్రామస్తుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహణ
అంగరంగ వైభవంగా నిర్వహించిన పడిపూజ



మాచర్ల, నవంబర్28(అక్షరభూమి): వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామంలో శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల నేతృత్వంలో పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి పడిపూజ కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలందరూ భారీగా తరలివచ్చారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్వహి ంచిన స్వామి వారి పడిపూజ మహోత్సవంలో గ్రామస్తులు, పలువురు భక్తులు పార్టీలకతీతంగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా స్వామివారికి భజన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజ అనంతరం స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అయ్యప్పస్వామి మాలధారులు, పలువురు పాల్గొన్నారు.

సాగర్ ఏపీఆర్జేసీకి రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం: ప్రిన్సిపల్ హేమాంబర్ రెడ్డి

నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లో రాష్ట్రస్థాయిలో స్థానం కైవసం
రాష్ట్రస్థాయి ఉత్తమ విద్యాసంస్థలో ఏపీఆర్జేసీ



పల్నాడు బ్యూరో, నవంబర్28(అక్షరభూమి): పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ ఏపీఆర్జేసీకి రాష్ట్రస్థాయిలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ విభాగంలో ప్రతిభ పురస్కారం లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హేమాంబర్ రెడ్డి శనివారం మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్ జీరో క్లీన్ అండ్ డ్రైవ్ లో తమ కళాశాల పనితీరు అద్భుతంగా ఉండడంతో తమకు పురస్కారం లభించిందన్నారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనంగా, ఆరోగ్యకర ఆరోగ్యకరమైన వాతావరణం కలిగి ఉండడంతో రాష్ట్రస్థాయి సంబంధిత శాఖ విద్యాసంస్థల్లో ఏపీఆర్జేసీకి స్థానం లభించిందన్నారు. అలాగే పల్నాడు జిల్లాలో ప్రతిష్టాత్మక గుర్తింపు పొందిన ఏకైక కళాశాలగా ఏపీఆర్జేసీ నిలవడం విశేషం అన్నారు. ఈ పురస్కారాన్ని జిల్లా డీసీఓ నందన కళాశాలకు అందించారన్నారు. కళాశాలకు ప్రతిభా పురస్కారం రావడంలో నెట్ జీరో కోఆర్డినేటర్ డా.ఎస్ఎం భాష, ఎకో, గ్రీన్ కమిటీ సభ్యుల కృషి, అంకిత భావం ఎంతో దోహదపడ్డాయన్నారు. అలాగే కళాశా ల విద్యార్థుల కృషి కారణమన్నారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పురస్కారం తల కళాశాలకు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచింగ్ కమ్యూనిటీకి న్యాయం చేకూర్చండి: PTLPU

గుంటూరు జోన్ లో ముసాయిదా కమిటీ సమావేశం
ప్రవేట్ టీచింగ్ కమ్యూనిటీకి రావలసిన బెనిఫిట్స్ పై ముసాయిదా కమిటీకి వినతిపత్రం



పల్నాడు బ్యూరో, నవంబర్28 (అక్షరభూమి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రైవేట్ టీచింగ్ కమ్యూనిటీకి ప్రభుత్వం న్యాయం చేకూర్చాలని PTLPU యూనియన్ డిమాండ్ చేశారు. గుంటూరు జోన్ లో ముసాయిదా కమిటీ సమావేశాన్ని శనివారం యూనియన్ వారు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రవేట్ టీచింగ్ కమ్యూనిటీకి రావలసిన బెనిఫిట్స్ అన్నింటిని ప్రభుత్వం అందించాలంటూ ముసాయిదా కమిటీకి వినతిపత్రాన్ని అందించారు. అలాగే ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్ ప్రైవేట్ మేనేజ్మెంట్ అసోసియేషన్, అలాగే మేనేజ్మెంట్ లందరికీ తగిన న్యాయం చేకూర్చాలని కమిటీ వారిని కోరారు. ప్రభుత్వం వారు తమ వినతులను పరిశీలించి తగు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్జెడి, డీఈవో, డివైఈఓ, ఎంఈఓలతోపాటు ప్రవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్స్, ప్రైవేట్ టీచింగ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, వర్కింగ్ జనరల్ సెక్రెటరీ శివయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి పూలే: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జింకల

పూలేకు నివాళులర్పించిన బీసీ నాయకులు



మాచర్ల, నవంబర్26(అక్షరభూమి): మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీసీ నేత, గొప్ప సంఘసంస్కర్త స్వర్గీయ మహాత్మ జ్యోతిరావుపూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జింకల నాగేశ్వరరావు అన్నారు. జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా శనివారం మాచర్ల పట్టణంలోని ఆర్అండ్ బీ బంగ్లా ఎదరుగానున్న పూలే విగ్రహాని బీసీ సంక్షేమ సంఘ పెద్దలు, నియోజకవర్గ కమిటి సభ్యులు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యక్షులు జింకల మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన మహనీయులు పూలే అని గుర్తు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బృంగా రమణారావు మాట్లాడుతూ పూలే ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తిదాయకమైన సామాజిక ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి బాదన్ బాయ్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు భీమవరపు లక్ష్మణ్, బీసీ నాయకులు తిక్కా కొండలు, ఎం.సుందరచారి, బొట్ల శ్రీనివాసరావు, బాలబోయిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అశ్వారావుపేట ఉద్యాన కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (ఆనర్స్) ఉద్యాన కోర్సులో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు సువర్ణావకాశం కల్పిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివి, TG EAPCET--2026లో అర్హత సాధించిన విద్యార్థులకు నవంబర్ 30వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి అశ్వారావుపేట ఉద్యాన కళాశాలలో చివరి విడత మాప్-అప్ కౌన్సెలింగ్ మరియు వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకోని అర్హులైన విద్యార్థులు కూడా ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రథమ సంవత్సరం విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు. నవంబర్ 17వ తేదీ నుంచి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట ఉద్యాన కళాశాలను 70 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంగణంలో ఆయిల్‌పామ్, కొబ్బరి, మామిడి, జామ, సపోటా, అరటి, బొప్పాయి, పనస, కోకో, మిరియాలు తదితర ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నట్లు వివరించారు. అదే ప్రాంగణంలో ఉద్యాన పరిశోధనా స్థానం కూడా ఉండటంతో విద్యార్థులకు మెరుగైన క్షేత్రస్థాయి విద్య, ప్రయోగాత్మక శిక్షణ, పరిశోధనా కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చక్కటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహ సదుపాయాలను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలు, స్వీయ ధ్రువీకరణ చేసిన జిరాక్స్ ప్రతులతో నవంబర్ 30వ తేదీన ఉదయం 9 గంటలకు అశ్వారావుపేట ఉద్యాన కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ప్రతిభ, అర్హత, రిజర్వేషన్ నిబంధనలు, ఖాళీ సీట్ల లభ్యత ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యాన విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఇదే చివరి అవకాశం అని, అర్హులైన విద్యార్థులందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8985721365 ఫోన్ నంబరులో సంప్రదించగలరు.

డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్
అసోసియేట్ డీన్
ఉద్యాన కళాశాల, అశ్వారావుపేట
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ.



గుంటూరు జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం



గుంటూరు, (అక్షర భూమి) : గుంటూరు జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదు మండలాల పరిధిలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. మొత్తం 87 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా, వాటిలో 16 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన 71 గ్రామ పంచాయతీలకు ఆదివారం పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల ను ముందుగానే పరిశీలించాలని, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బం దికి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల నియ మావళిని కచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విధులు కేటాయించిన అధికా రులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. 87 గ్రామ పంచాయ తీలకు నోటిఫికేషన్ విడుదల కాగా, 16 చోట్ల పోటీ లేకుండానే ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో మిగిలిన 71 గ్రామ పంచాయతీ ల్లోనే ఆదివారం ఓటింగ్ జరగనుంది. ఈ పంచాయతీల పరిధిలో ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, అవసరమైన సామగ్రి సిద్ధం చేయడం వంటి పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు స్థానిక పాలనలో కీలకమైనవని, ప్రజలు తమ గ్రామ అభివృద్ధికి ప్రాతినిధ్యం వహించే నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ఓటర్లందరూ పోలింగ్ రోజున తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకా కుండా స్వేచ్ఛగా తమ నిర్ణయాన్ని వెల్లడించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమ యంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఐదు మండలాల పరిధిలోని 71 గ్రామ పంచాయతీల్లో ఆదివారం జరగ నున్న పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా యం

కాపు వన సమారాధనకు కాపు సేవా సంఘం ఆహ్వానం

- కాపు కుటుంబ సభ్యులంతా కుటుంబ సమేతంగా పాల్గొనాలి

బాపట్ల (అక్షర భూమి), నవంబర్ 28: బాపట్ల కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 29వ తేదీ ఆదివారం కాపు వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. బాపట్ల సూర్యలంక సముద్ర తీరంలోని వేవ్ ఫ్రంట్ లేఅవుట్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. తొలుత అల్పాహారం ఏర్పాటు చేయగా, అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థినీ విద్యార్థులకు విద్యా పురస్కారాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వన సమారాధన కార్యక్రమం నిర్వహించడంతో పాటు అనంతరం వివిధ ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాపు కుటుంబ సభ్యులు, కాపు సేవా సంఘం పెద్దలు, కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం తరఫున నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజుని మర్యాదపూర్వకంగా కలిసిన ఏకగ్రీవ సర్పంచులు

బాపట్ల (అక్షర భూమి)

28.11.26 బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు నూతనంగా, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచుల వివరాలు:

1. కర్లపాలెం: షేక్ బాజీ
2. యేట్రవారిపాలెం : చీరాల వెంకట లక్ష్మి
3. పెదపులుగువారి పాలెం: పులుగు వెంకటసుబ్బమ్మ
4. నాగరాజు పాలెం: షేక్ వహిదాబి
5. నల్లమోతు వారి పాలెం: పొన్నం యానాదమ్మ
6. తుమ్మలపల్లి: దర్శి వెంకటసుశీల
7. దమ్మన్నవారి పాలెం: మన్నెం పోతురాజు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు నూతన సర్పంచులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరువ చేయాలని ఆయన సూచించారు. తమ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



మూడో విడత పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్

376 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తి

పల్నాడు, (అక్షర భూమి) : మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కృతికా శుక్లా ఐఏఎస్ శనివారం (నవంబర్ 28) నిర్వహించారు. ఈ సందర్భంగా మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని 376 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు కంప్యూటరైజ్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సహకారంతో సంబంధిత ఎన్నికల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల విధుల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం పాటించేలా కంప్యూటరైజ్డ్ విధానంలో సిబ్బంది కేటాయింపు చేపట్టారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.



రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైన మూల్పూరు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల(అక్షర భూమి)28.11.26 మూల్పూరు గ్రామం,అమృతలూరు మండలం.బాపట్ల జిల్లా.2 వ సాధారణ స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికలలో బాగంగా 29 న ఆదివారం జరగనున్న రెండో విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం అమృతలూరు, మండలం, మూల్పూరు గ్రామం మండల ప్రాథమిక పరిషత్ మరియు జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్,వి., పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారిణి బి.శ్రీదేవి, తహశీల్దార్,నెహురు యం పి డి ఓ,పంచాయతీ సెక్రటరీ వి ఆర్ ఓ లు తదితరులు ఉన్నారు



చేనేత, హస్తకళా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణహిత వస్త్ర సంచులను వినియోగించాలి: మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ

గుంటూరు, (అక్షర భూమి) : సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులకు ప్రజలు ఆదరణ కల్పించాలని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ సూచించారు. స్థానిక కళాకారుల సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని జయాస్ నవరంగ్‌వస్త్ర దుకాణాన్ని మేయర్ లక్ష్మీ అపర్ణ సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ చేనేత వస్త్రాలు, చేతితో తయారు చేసిన వస్త్ర సంచులు, బ్లాక్ ప్రింటింగ్ కళాకృతులను ఆసక్తిగా పరిశీలించారు. వాటి తయారీ విధానం, ప్రత్యేకతలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్రాల్లో ప్రతిబింబించే మన సంప్రదాయ కళా వైభవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మేయర్ పేర్కొన్నారు. స్థానిక కళాకారులు, హస్తకళాకారుల నైపుణ్యానికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభించేలా ప్రజలు సంప్రదాయ ఉత్పత్తులను ఆదరించాలని సూచించారు. చేతితో తయారు చేసిన వస్త్ర సంచులు, బ్లాక్ ప్రింటింగ్ కళాకృతుల రూపకల్పనలో నిర్వాహకులు చూపుతున్న సృజనాత్మకతను అభినందించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని అన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణహితమైన వస్త్ర సంచులను వినియోగించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. మన సంప్రదాయ చేనేత, హస్తకళలకు ఆదరణ కల్పిస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న జయాస్ నవరంగ్ నిర్వాహకులను మేయర్ లక్ష్మీ అపర్ణ ప్రత్యేకంగా అభినందించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌పై ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు ఆగ్రహం

'ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు.. నన్ను అసమర్థుడని విమర్శించే అర్హత నీకు లేదు'



బాపట్ల (అక్షర భూమి), నవంబర్ 28: మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌పై బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై చేసిన విమర్శలకు ఘాటుగా స్పందిస్తూ.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించింది తానేనని అన్నం సతీష్ భావించుకోవడం ఆయన అమాయకత్వమని వ్యాఖ్యానించారు. బాపట్ల నియోజకవర్గ ఓటర్లలో అన్నం సతీష్ ఒక్కరేనని, గత ఎన్నికల్లో ఆయన 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. బాపట్ల పట్టణంలోని వ్యాపార సంఘాలను భయపెట్టింది అన్నం సతీషేనని ఆరోపించారు. ఆయన ఎప్పుడు బాపట్లలో ఉంటారో, ఎప్పుడు విమానంలో ప్రయాణిస్తారో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను ఎప్పుడూ బాపట్లలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తనను అసమర్థ ఎమ్మెల్యే అని విమర్శించే ముందు మాట్లాడే వ్యక్తికి ఆలోచన ఉండాలని వ్యాఖ్యానించారు. అన్నం సతీష్ ఎంతమందిని బెదిరించారో తన వద్ద ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ

'ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యంతో మహిళలను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



గుంటుపల్లి, (అక్షర భూమి) నవంబర్ 28 : మహిళా పారిశ్రామి కవేత్తల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి కుటుం బం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో మహిళల ను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఐఏఎస్ పేర్కొ న్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిం చడంతో పాటు తమ వ్యాపారాలను విస్తరించుకునేలా అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పించాలని సూచించారు. గుంటు పల్లిలోని RISE కేంద్రంలో XLRI సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించి న 'వ్యాపార దార్శనికత, అభివృద్ధి' శిక్షణ కార్యక్రమంలో 130 మంది మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మం ద్వారా మహిళలకు వ్యాపార రంగంలో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగ మించే మార్గాలు, వ్యాపార అభివృద్ధికి అవసరమైన అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు కేవలం చిన్న తరహా వ్యాపారాలకే పరిమితం కాకుండా తమ వ్యాపారాలను విస్తరించి, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇందుకోసం వ్యాపార నిర్వహణలో మెళకువలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, మార్కెట్ అవకాశా లను గుర్తించడం, వ్యాపార అనుసంధానాలు పెంపొందించు కోవడం వంటి అంశాల్లో శిక్షణ అందించడం కీలకమన్నారు. మహిళల్లో దాగి ఉన్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి, వారిని స్వయం ఉపాధి నుంచి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేం దుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు.

Printed, Published and Owned by Billa Raju, D.No : 6-12-51/A, Arundelpet, 12/1, Guntur - 522002, Printed at Sowmya Graphics, D.no : 26-36-72, Ankamma Nagar, Guntur